


# కొడిగట్టిన దీపం

పెద్ద కథ

రామంచెల్లెలి పెళ్ళయిపోయింది. ఒక్కొక్కళ్ళే వెళ్ళిపోతున్నారు. ఆవేళ కమలావాళ్ళూ వెళ్ళిపోయారు. రామానికి ఏమిటో వెలితిగా కనిపించింది.

బస్సెక్కించాడు తనే. అయినా కమల వెళ్ళిపోయిందని నమ్మలేదు. ఆ కళ్ళు అంతగా కట్టేసుకున్నాయి తనని. కమల...ఎవరు యీ అమ్మాయి? ఏమిటీ తనని యిలా చేసేసింది?

చిన్నప్పుడు ఆడుకునేరోజులలో కమల తనకి తెలియదు. ఈ మధ్యలో ఎప్పుడో వచ్చింది. ఓసారి ఎప్పుడో కమలతో దొంగాట ఆడిన జ్ఞాపకం. ఎందుకో కమలకి తను దొరికిపోయాడు పరుగెట్టగల శక్తి ఉండీ. అంతే... మళ్ళా కమలని తనుచూసిన గుర్తులేదు; మళ్ళా ఆ అమ్మాయి బావ పెళ్ళికి వచ్చిన దాకా. అప్పుడు కమలతో తన పరిచయం ప్రారంభం. ఆ పరిచయం చివరికిప్పుడు నలిపేస్తోంది. కమల వెళ్ళిపోయింది. ఇక ఆ సోగకళ్లు తనకేసి చూడవు. ఇంక తను యిల్లు వదలకుండా, రెప్పవాల్చకుండా ఆ కళ్ళకేసి చూడడు. రెండు పెదిమలూ ఏమీ ఎరగనట్టు పెట్టి ఆ కళ్లు రెండూ ఒక మూలకివెళ్తే,...అంతే... తనెక్కడున్నాడో మరిచిపోయేవాడు. అసలా అమ్మాయి మాట్లాడదుగదా! ఎప్పుడు జవాబు చెప్పాలిసొచ్చినా ఆ కళ్ళతోనే. అప్పుడు ఆ పెదిమలు ఎలా పెడుతుందో! నోటి ముత్యాలు రాలిపోతూంటే గట్టిగా మూతపెట్టినట్టు...భలే పెడుతుంది.

కమలని బస్సెక్కించి ఇంటికొచ్చాడు రామం.

"వెళ్ళారా? బస్సు అందిందా?" అంది సరళ.

అందిందన్నాడు రామం ముభావంగా.

"ఇంతసేపయిందేం? యిప్పుడే వచ్చిందా బస్సు?"

"ఊఁ"

"హాయ్! పొద్దున్న ఏడుగంటలకి రావలసిన బస్సు పదిగంటలకొచ్చిందా? అబద్ధమాడినా నమ్మేటట్టుండాలి."

"ఏదో అయింది పోనిస్తూ" అంటూ రామం వీధిలోకి వెళ్ళిపోబోతున్నాడు. ఇంక అట్టేసేపు ఆ యింట్లో ఉండలేడు. కమల లేదుగా...పాపం సరళేంచేసింది? తనకేమిటో సరళచేసే ప్రతిపనీ అదోలా కనిపిస్తుంది. ఇప్పుడు సరళవేసినప్రశ్నే కమలవేస్తే, హాయిగా తన చాకచక్యం అంతా వినియోగించి జవాబు చెప్పేవాడు కాడూ!

సరళ కేమనిపిస్తుంది తనంతమకీ అంటీముట్టనట్టుంటే? ఇంతకీ తనేం చేసింది కనుక, మామూలుగానే ప్రశ్న వేసింది. తనే జవాబు చెప్పలేకపోయాడు. అసలెందుకు తనకీ అయిష్టం ప్రారంభమయింది?

మళ్ళా సరళంటే అభిమానం లేకపోలేదు. ఆ అమ్మాయి తెలివైందని తనకి తెలుసు. ఆమె బాగుపడి అభివృద్ధిలోకి రావాలనీ తనే పట్టుపట్టి కాలేజీలో చేర్పించాడు, అన్నీ బాగానే ఉన్నాయి. కాని సరళతో, కమలతోలాగా సరదాగా కాలం గడపలేడు. దూరంగా ఉన్నప్పుడు బాగానే

ఎ. నారాయణరావు

ఉంటుంది. సరళ అందమైనది, ఎర్రగా, సన్నగా సంపెంగలాంటి ముక్కుతో, దొండపళ్ళలాటి పెదిమలతో ఎంతో అందంగా ఉంటుంది. ఈ సంగతి ప్రపంచంలో అందరూ వొప్పుకుంటారు. తనూ వప్పుకుంటాడు. కాని పేచీ అల్లా...సరళ తనదగ్గిర ఉంటేనే... ఆమెలో ఏరేఖా తనని ముగ్ధుణ్ణి చెయ్యదు. ఏ సౌందర్యమూ తనని ఉక్కిరిబిక్కిరి చెయ్యదు. ఏ కదలికా తనని మత్తెక్కించదు. కాని సరళ అందమైనదట. అది అల్లా ఉండగా తనకి ఏమిటో సరళ అందమైనది అని అనిపించదు. ఆమెని అన్నివైపులనుంచీ చూడగా ఏదో ఒక భంగిమలో సరళ 'అందమైనది సుమా!' అనిపిస్తుంది. తక్షణం ఆమె ఏదో మాట్లాడుతూంటే, ఆ విన్యాసం, ఆ మాట, తనకి ఏమిటో ఎచ్చెట్టుగా తోస్తాయి. "ఏమిటీ సరళ యిలా మాట్లాడుతుంది?" అనుకుంటాడు.

రామం వీటికి వేటికీ కారణాలు చెప్పలేడు. ప్రపంచంలో ఎన్నిటికి కారణాలుంటాయి?

రామానికి వీధిలోకూడా ఏమీ తోచలేదు. ఇంట్లోకి వచ్చాడు. సరళ పుస్తకం తెరుచుకుని చదువుకుంటోంది. రామం రెండుజేబుల్లో చేతులు పెట్టుకుని మెల్లిగా అడుగులువేస్తూనడుస్తున్నాడు. కొంతసేపు సరళకేసి చూశాడు. సరళ ఎర్రనిరంగు చీర, ఎర్రటి జాకెట్టు తొడుక్కుంది. ఎర్రరంగు ఎర్రని శరీరం వాళ్ళకి చాలా బాగుంటుంది. సరళ సీరియస్‌గా చదువుకుంటోంది. రామం అలా చూస్తూ నిలబడ్డాడు. "సరళ అందమైనదే"రామానికి ఒక్కసారిగా స్ఫురించింది. రామం నిలబడే ఉన్నాడు. ఏవో విచిత్రమైన చూపులతో ఆ అమ్మాయిలో ప్రతిరేఖా పరిశీలిస్తున్నాడు.

"రామం— నాకిదేమిటో తెలియడంలేదు- చెప్పవ్"చటుక్కున లేచివచ్చింది సరళ."ఇదిగో యీ పాఠం అసలు తెలియడంలేదు" అంటూ పుస్తకం దగ్గిరగా తెచ్చి చూపించింది. పుస్తకం చేతిలోకి తీసుకున్నాడు రామం. ఎక్కడ? అని అడిగాడు. ఏదో జవాబుచెపుతోంది సరళ. రామానికది అర్థంకావడంలేదు. అసలు తనామాటలు వినడంలేదు. క్షణంక్రితమే సరళ అందమైనదే అనిపించి...ఒక్క కదలికతో, ఒక్కమాటతో, ఆ కల కరిగిపోయిందే...ఏమిటూ...అని ఆలోచిస్తున్నాడు రామం. సరళకి విసిగెత్తిందేమో... ఇదిగో! యిక్కడ," అని దగ్గిరగావచ్చి చేత్తో చూపించింది.

"అర్థమయిందిలే...చెప్తానుండు..."అంటూ దూరంగా తప్పుకున్నాడు. నరాలు ఆపాదమస్తకం వణికాయి ఆ అనుభూతికి. "ఇప్పుడే వస్తానుండు, చిన్నపని మరిచిపోయాను"అంటూ వీధిగుమ్మం వేపు నడిచాడు రామం.

"అంతేలే...యింక మనకి యిల్లక్కరలేదు. కమలలేదుగా..."అంది సరళ.

రామానికి చురుక్కున తగిలింది యీ మాట. సరళ వట్టి ఆడది, ఆడవాళ్ళకుండే అసూయ, చిన్నచిన్నవాటిదగ్గర పేచీలుపెట్టుకోడంలాంటి గుణాలన్ని మూర్తీభవించి ఉన్నాయి సరళలో.

తనేమీ మాట్లాడలేదు. తలవంచుకుని నడుస్తున్నాడు. ఆ మాట అనేసి ఒక్క నవ్వునవ్వింది సరళ. 'అబ్బ ఎంత వెకిలిగా నవ్వుతుంది సరళ' అనిపించింది రామానికి.

సరళెందుకునవ్వింది? రామానికి అర్థంకాలేదు. సరళకి పాఠం ఎందుకుచెప్పలేకపోయాడు? కమల తనదగ్గిరగా నిలబడితే విద్యుత్తరంగచలనం చవిచూసే తను, సరళ చెయ్యితగిలితే నిప్పుకాలినట్టు దూరంగా ఎందుకు తప్పుకున్నాడు? సరళ చేసే ఏ పనీ తనకి బాగుండదు. ఎందుకో తెలియదు.

సరళ పాపం అమాయకురాలు, ఏదో మాట అంటుందేకాని, ఆ మాట ఎంతదూరం వెళ్తుందో తెలియదు. మనిషిలో చాకచక్యం, పదునూ లేవు. దానితోడు సామాన్యంగా స్త్రీలకుండేలాంటి గుణాలన్నీ ఉన్నాయి. తను కొంచెం ఉన్నతస్థితిలో ఉంటేచాలు, అమాంతం ఏదో గర్వంగా చూస్తుంది. తనకన్నా కొంచెం ఎక్కువవాళ్లుంటే అకారణంగా యీర్ష్యవచ్చేస్తుంది. తనకి ఎన్నోనగలున్నాయి, కమలకి లేవు. తనెంతో అందంగా ఉంటుంది, కమల ఉండదు. తను పెద్దచదువు చదువుకుంటోంది. కమల అంత చదువుకోలేదు. ఇంక సరళసంగతేం చెప్పాలి? కమలముందు ఎప్పుడూ యింగ్లీషే మాట్లాడుతుంది. తనేవిటో మహాగొప్ప అనుకుంటుంది. కాని పాపం సరళకి తెలియదు. ఇవేవీ గొప్పతనాలుకావనీ, నిజమైన గొప్పతనాలు యింకేవో

ఉన్నాయనీ. తనకవన్నీ తెలిసినట్లు, గంభీరంగా సరళమాటలు వింటుంది కమల. రామం ఆశ్చర్య పోతాడు. కమల ఎంత విచిత్రమైన, అరుదైన స్త్రీప్రకృతి! కాని పాపం సరళ మంచిది. చాలా మంచిది. ఒకళ్ళకి చేతులారా హానిచెయ్యలేదు. అందరూ తనవాళ్ళేననుకుంటుంది. ఆ మంచి తనంలో అమాయకత్వంఉంది. తెలివితేటలూ, గడుసుతనంఉండీ, మంచివాళ్లు కొందరుంటారు. సరళ అలాటిదికాదు. లేకపోతే, సరళకళ్ళముందే తను కమలతో పరిచయం ప్రారంభించాడు. సరళ చూస్తూండగానే, కమల కళ్ళకాంతుల పరిధిలో పరిభ్రమించడం నేర్చుకున్నాడు. ఇంత చూస్తూకూడా అర్థంచేసుకోలేదు సరళ. ఇవేళ ఏదోమాట అంది, మొదటిసారిగా. అదేనా అంత అర్థంచేసుకుని అనిఉండదు.

కాని తను మారాలి. తప్పదు. సరళ తనకి కాబోయేభార్య. ఆమె అంటే యిష్టం అలవాటు చేసుకోవాలి. తప్పదు. వాళ్ళనాన్నా వాళ్ళూ అన్నివ్యవహారాలూ స్థిరపరచుకున్నారు. సరళ ఆస్తిఅంతా తమకు కలుస్తుందని రామంనాన్న గంగాధరంగారు పథకంవేశారు. గంగాధరంగారి కొన్నిలక్షలూ తమ్ముతాము రెండుపెట్టి హెచ్చ వేసుకుంటాయి. అందుకు ఆయన ఏకైకపుత్రుడు రామం అడ్డుపడకూడదు. పడితే చాలా పేచీలు వస్తాయి.

...కాని, రామానికిదంత తేలికగా కనిపించడంలేదు. తను సరళను ప్రేమించడంమాట అటుంచి...అసలు కమలని కాదనగలడా? ఆమె శక్తినుంచి తప్పించుకోగలడా?

* * *

కమల వెళ్ళిపోయి చాలారోజులయింది. రోజు రోజుకీ ఆమె ప్రభావం తగ్గినట్టు కనిపిస్తోంది. ఇప్పుడు రామం ఆమెని గురించి తదేకంగా ఆలోచించడం తగ్గింది. కాని, సరళ మాత్రం ఎంత ప్రయత్నించినా తనకి మునపటిలాగానే ఉంది. ఆమె పనులు వెనకటిలాగానే, ఎబ్బెట్టుగా, వెకిలిగా, లేకపోతే తనేపేరూ పెట్టలేని అదో యిదిగా కనిపిస్తూనే ఉన్నాయి. చాలా కష్టంమీద తనలోఊహాలు అణుచుకుంటున్నాడు. ఏదో అనురాగం తెచ్చిపెట్టుకోవాలనే అభిప్రాయమే తనకి లేకపోతే, అతనాప్రయత్నం చెయ్యకపోను. కాగా, అతని ప్రతిప్రయత్నం వెనకా, "యిది కృత్రిమం" అని ఎవరో జ్ఞాపకం చేస్తున్నట్టుస్పష్టంగా గోచరిస్తోంది.

సరళతో ఎంతోకష్టంమీద కొన్నిగంటలు రోజూ గడపటం అలవాటు చేసుకున్నాడు రామం. ఆమె మనస్తత్వం తనకి విరుద్ధమైనది. ఈ ప్రకృతుల వైవిధ్యం ఎల్లా కలుగుతుందో తెలియదుకాని, వచ్చిందా, దీనిని పోగొట్టే అవకాశంలేదు.

ఈ అనుభూతులకి కారణాలుండవు. తనే కమలతో మాట్లాడడమో, చివరికి ఒకరి సమ్ముఖంలో మరొకరుండడమో సంభవిస్తేచాలు. ఒళ్ళంతా పులకరిస్తూ, మనసంతా హృదయమై ఎన్నెన్నిమాటలు మాట్లాడుకుంటారు. ప్రతిచూపు రీతిలో, ప్రతిమాట ఫణితిలో, ప్రతికదలికలో ఎన్నిస్వప్నాలు కనిపిస్తాయి! కాని సరళతో అలాటి వైచిత్రి ఏదీలేదు - సరిగదా - వైవిధ్యం కూడా ఉందిగదా!

రామం చాలా గట్టిగా ప్రయత్నిస్తున్నారు. తను సరళని చేసుకోకపోవడంవల్ల రెండు బీరకాయపీచులాంటి వంశాలమధ్య ఒక పెద్ద అఘాతం ఏర్పడుతుంది. సంబంధం అంటే ఇంత సీరియస్‌గా తీసుకుంటారు పెద్దవాళ్లు. సుఖంగా, సంతుష్టిగా, తృప్తిగా, వాళ్ల మనమడూ, మనమరాలూ పెళ్ళిచేసుకుని ఉండగా చూద్దామని కాసుకుని కూర్చున్న ముసలివాళ్ళ హృదయంలో ముల్లు గుచ్చుకుంటుంది. ఇంకా ముందుకుపోతే, తను తన యింటికి విరోధి అవుతాడు. తన తండ్రి యింకో కుటుంబానికి విరోధిఅవుతాడు. ఏమిటో యిదంతా పిచ్చి పట్టుదల. సరళకి తనకన్నా మంచివాడు,అందమైనవాడు, అనుకూలమైనవాడు వరుడుగా దొరుకుతాడు. కాని యీ దృష్టి పెద్ద వాళ్ళ కుండదు. అసలు పెళ్ళి విషయంలో 'యిష్టం' లేదు అంటే వాళ్ళు అర్థం చేసుకోరు. పెళ్ళి చేసుకోవడంలో కొన్ని తరహాల వ్యక్తులకి యిష్టాయిష్టా లుంటాయని వాళ్ళకి తోచదు. ఏమన్నా అంటే మేం కాపురాలు చెయ్యలేదా అంటారు. చేశారు నిజమే. నూటికి తొంభై మందికి వివాహం వట్టి ప్రాపంచిక వ్యవహారం.

ఆడదయితే చాలు పెళ్ళాడడానికి వాళ్ళ కభ్యంతరం ఉండదు. అందులో కొంతమంది మాత్రం కొంచం రంగు, రూపు,అంటూ ఏమిటో మాట్లాడతారు. కాని కొంచం రూపాయిల రుచిచూపిస్తే యివ్వన్నీ తగ్గిపోతాయి. కొంతమంది ధైర్యంగా “ఏమన్నా కొరుక్కుతింటామా”అని చెప్పేస్తారు.

ఇది యిలా ఉండగా సరళ అందంగా కూడా ఉంటుందిగదా! అలాటి చక్కని అమ్మాయిని కాదని డబ్బూ, రూపూకూడా లేని కమలని చేసుకుంటే ప్రపంచానికి ఏ కారణాలు చూపించ గలడు?

సరళకి కూడా తనకి మల్లే విచిత్రమైన అభిరుచు లుంటే బాగుండును. కాని అలా కాదుగదా. ఆ అమ్మాయి తననిచ్చి పెళ్ళిచేసిన ఏ మగాడితోనైనా కాపరం చేస్తుంది. ప్రపంచంలో ఎక్కువమంది తరహా ఆ అమ్మాయిదీని.

ఆలోచించినకొద్దీ అతని తల తిరిగిపోతుంది. తనవల్ల, తన ఒక్కడివల్ల, యింత దారుణం! అనేకమందిలో యింత కల్లోలం, రెండు కుటుంబాలలో పరస్పర వైర్యం - యివన్నీ రావలసిందేనా? లేకపోతే నిశ్శబ్దంగా, తను కొంచెం సర్దుకుపోతే, అంతా హాయిగా ఉంటుండే. పాపం సరళ-చాలా అందమయింది. అసలు ప్రపంచంలో అందమైన భార్యకి భర్తగా ఉండడంలో ఒకవిధమైన గర్వం ఉంది. సరళ మంచికూడా. అమాయకురాలు. తనంటే ఎంతో అభిమానం తను యీ పనిచెయ్యకపోతే, లేనిపోని తుఫాను. అందుకని రామం

“కెరలించకు శాంతి తరంగాలను” అనుకున్నాడు.

* * *

మెల్లిగా సరళ చేతలకీ, మాటలకీ, రామం ఓర్పుతో యిష్టపడడం నేర్చుకొంటున్న సమయంలో, బలమైన విద్యుత్తరంగ ప్రవాహంలా వచ్చేసింది కమల. అయిపోయింది - రామం అచేతనుడైపోయాడు. ఏమీ ఎరగనట్టు కనపడే ఆ రెండు సోగకళ్లూ ఎంత దారుణంగా, నిర్దాక్షిణ్యంగా పనిచేస్తున్నాయి తనమీద? రామం తనని తాను మరిచిపోయాడు.

ఆవేళ రామం మేడమీద కూర్చుని ఏదో రాసుకుంటున్నాడు. అమ్మ భోజనానికి రమ్మంటూందని చెప్పడానికి కమల వచ్చింది. “సరే వస్తున్నా”అన్నాడుతలవిత్తకుండా ఆ మాటేనా వినకుండా కమల మెట్లు దిగిపోతోంది. ఇంకెవరన్నా పిలిస్తే రామం మెల్లిగా వచ్చేవాడే. కాని అప్పుడు వెంటనే మెట్లు దిగాడు.

ఆ మెట్లు తిన్నగా కొంతదాకా ఉండి, ఒక్కసారి ఎడంపక్కకి తిరిగి వెంటనే కిందికి తిన్నగా ఉంటాయి. ఆ వొంపున్నచోట కొంచెం వెడల్పులుగా ఒక చతురస్రం ఉంటుంది. రామం గబగబా మెట్లు దిగిపోతున్నాడు. ఆ వొంపు దగ్గర కొచ్చేసరికి...కమల యింకా దిగలేదు. హఠాత్తుగా కమలకి దగ్గరగా వచ్చేశాడు. ఒంట్లో ఏదో కదలిక ప్రసరించింది. అచేతనుడైపోయాడు. ముందుకు అడుగు వెయ్యలేడు. కమలకూడా ముందుకు అడుగు వెయ్యలేదు. ఏదో మత్తు కలిగించే ఉత్కంఠతో కమల చెంపలు చేతులోకి తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు. మెరుపులా కమల పారిపోయింది. రామం ఆ స్వప్నంలోంచి తేరుకోడానికి కొంతసేపు పట్టింది. రామం వొళ్ళంతా మంత్రోపహతమైపోయింది. మెల్లిగా అడుగులు వేసుకుంటూ వంటింట్లోకి వెళ్ళాడు. నెయ్యివేస్తున్న కమలని చూడడానికి సిగ్గు—చూడాలని కాంక్ష.

రామం యీ అనుభూతికి ఉక్కిరిబిక్కిరయిపోయాడు. అది తలుచుకున్నప్పుడల్లా నరాలు చలిస్తాయి. అది ఒక క్షణికమై, శాశ్వతమైన, దివ్యానుభవంలా అతన్ని కరిగిస్తోంది.

భోజనం ఐపోయిన వెంటనే అమ్మ, “కమలావాళ్ళూ యీ 12 గంటల బండి కెళ్తారట. దిగబెట్టిరా నాయనా” అంది. రామం ఆశ్చర్యపోయాడు. అరె! చెప్పనేలేదే కమల!

రైలు టైమైపోతోంది. యాంత్రంలాగా కమలతో స్టేషనుకు వెళ్ళాడు. కమల రైలుపెట్టెలో కూర్చుంది. తను కమల కళ్ళకేసి అలా చూస్తున్నాడు; మధ్యలో ఎటో తిప్పుతున్నా ఆ కళ్ళేమంటున్నాయో తనకి తెలుసు. “నన్ను మరిచిపోవు గదూ” అంటున్నాయి అవి.

“ఉహుం ఎప్పుడూ మరిచిపోను” అంటున్నాడు తను. అంతా కళ్ళతోనే...ఎన్నిసార్లో

ఆ మాటలే అంది కమల. అన్నిసార్లూ హృదయంతో జవాబు చెప్పాడు తను.

రైలు వెళ్ళిపోయింది. కమల వెళ్ళిపోయింది. ఆ రోజల్లా రామం ఏవో అనుభూతులు నెమరుకు తెచ్చుకుంటున్నాడు.

కమల తనది. తనదై పోయింది, ఆ సంఘటనతో పూర్తిగా తనదై పోయింది. తను కమలకి ద్రోహంచెయ్యడు. కమలకోసమే తనుపుట్టాడు. అందుకెవరేమి అడ్డంచెప్పినా వాటిని ధిక్కరిస్తాడు. కమలకోసం ఎన్నికష్టాలువచ్చినా భరిస్తాడు. కమల సామాన్య స్త్రీ కాదు. ఆమెను సంఘపు మర్యాదల రంగద్దాల కళ్ళజోడులోంచి చూడకూడదు. ఏమయినాసరే కమలనే పెళ్ళాడాలి. మహా ఐతే తనకంతా విరోధు లవుతారు. అంతేనా? కానీ, అచంచలమైన నిశ్చయానికి వచ్చేశాడు రామం...కొండలని పిండి కొట్టెయ్యగల ధైర్యం, బలం వచ్చేశాయి అతనిలోకి. ఇక సరళ విషయం జ్ఞాపకమేలేదు-రామం "లోకంతో మనకేటికి" అనుకున్నాడు.

* * *

ఈ నిశ్చయం చేసేసుకున్నాక, దానికి తగిన పరిస్థితులు కల్పించుకోడానికి మెల్లిమెల్లిగా ప్లానులువేసుకుంటున్నాడు రామం. ఒకవేళ పెద్ద పోస్టే-ఎల్లాగూ వస్తుందని తనకి తెలుసు. దానికి తట్టుకోడానికి తగిన ప్రణాళికలు తయారు చేసుకుంటున్నాడు. ఈ లోపుగా సరళతో తన పెళ్లి సంగతి వచ్చినప్పుడల్లా ఏదోరకమయిన అయిష్టం (వాచ్యంగా లేకపోయినా) నిర్లిప్తత, అసలు తనకి పెళ్ళే వొద్దనడం, లేకపోతే యింకా చాలా ఏళ్ళదాకా చేసుకోననడం ప్రారంభించాడు.

"మామహావాళ్ళంతా యిల్లాగే చెప్పారు... చివరికి అలాంటివాళ్ళే అందరికన్నా ముందు పెళ్ళాడేసి, పెళ్ళాలికి దాసులైపోతూరు. ఎవరికి తెలియదు లేవోయ్'' అనేది సరళ తల్లి.

"లేకపోతే ఎవరన్నా నాకు పెళ్లికావాలని చెపతారటమ్మా" అనేది పక్కింటావిడ నవ్వుతూ.

రామం మాత్రం తన నిశ్చయం రోజురోజుకీ బలపత్తరం చేసుకుంటున్నాడు.

* * *

రామం స్నేహితుడు వెంకట్రావోసారి రామాన్ని వాళ్ళవూరు రమ్మన్నాడు. రామం తనకీ మార్పువల్ల కొంత ప్రయోజనం కలగవచ్చునని బయలుదేరాడు. రాజా కూడా శెలవులేగా అందుకని అక్కడికి వచ్చాడు.

రామం, రాజా, వెంకట్రావూ ముగ్గురూ ఒక కంచంలో తిని, ఒకమంచంమీద పడుకున్నంతగా పెరిగారు చిన్నప్పటినుంచీ. వెంకట్రావు ఇప్పుడు ఆ వూళ్ళో మేష్టరు. రాజా యింకా చదువుతూ ఉన్నాడు. ఈమధ్య చాలాకాలమయింది వాళ్లు కలుసుకుని.

ఆ వూరిలో ఒక గొప్ప జోతిష్కుడున్నాడు. ఆయన అంగ, హస్త, సాముద్రికాలలో జ్యోతిషంలోబహుప్రవీణుడు. వెంకట్రావుకి పరిచితుడు. రామానికసలు యిలాటి వాట్లో ఏ నమ్మకమూ లేదు. కాని వెంకట్రావు యిపన్నీ ఖచ్చితంగా నిజమయే శాస్త్రాలంటాడు.

వెనక రామం తన ఎమ్. ఏ. పరీక్ష పోతుందనుకున్నాడు; అసలు పరీక్షకు వెళ్ళకూడదు అనుకుని చివరికి తెగించి రాసేశాడు. అపుడు వెంకట్రావు జ్యోతిషునడిగితే, రామానికి క్లాసు వస్తుందని చెప్పాడు. ఆమాట నిజమైంది. పరీక్ష పోతుందన్న రామానికి క్లాసు వచ్చింది. కాని అంతమాత్రాన రామం జ్యోతిషం నమ్మే దశకి రాలేదు. కానియిప్పుడు జ్యోతిషం వట్టి బూటకం అని మాత్రం అనడు.

రాజా పరీక్ష ఏమవుతుందో తెలుసుకుందాం అన్నాడు రామం.

"ఏదో ఒకసారి నిజమయిందని మిడతంబొట్లు జ్యోతిషం అన్నిసార్లూ అవుతుందిటయ్యా'' అని అన్నాడు రాజా. రాజాకి యిలాటి వాటిమీద ఏ నమ్మకమూ లేదు. వెంకట్రావుకి పిచ్చినమ్మకం. రామం యీ రెంటికీ మధ్య.

"జ్యోతిషం ఎంత నమ్మనని చెప్పేవాడేనా ఓసారి అది తనకు తెలియకుండా నమ్ముతాడు" అన్నాడు వెంకట్రావు.

"ప్రతివాడికీ తన జీవితంలో ముందు యెలా ఉంటుందో తెలుసుకోవాలనే విచిత్రమైనకోరిక ఉంటుంది. ఆ బలహీనతని ఉపయోగించుకుంటారు యీ జ్యోతిష్యుడు. వాళ్లు చెప్పేవాట్లో

ఎక్కడో నిజం ఉండొచ్చు. కాని చాలాభాగం వట్టికబుర్లు." అన్నాడు రాజా.

"ఒకే! నీకు తెలియకపోతే ఊరుకో. అంతే కాని పిచ్చిగా ప్రతీదీ మాట్లాడకు. జ్యోతిషం తప్పయితే శాస్త్రానిది తప్పుకాదు, ఆ జ్ఞానం పూర్తిగాలేని జ్యోతిషుడితప్పు. జ్యోతిషం గణిత శాస్త్రమంత ఖచ్చితమైన శాస్త్రం." అన్నాడు వెంకట్రావు.

"పోనీ మీకెందుకోయ్! యీ దెబ్బలాట. మనం నమ్ముతామోలేదో, అది తరవాత మాట. ఆయన చెప్పదలచుకున్నదేదో వినవచ్చుగా" అన్నాడు రామం.

చివరికి రాజీకుదిరింది. వెంకట్రావు ఆయన్ని యింటికి తీసుకొచ్చాడు. జ్యోతిషంచెప్పకముందు అసలా శాస్త్రం ఎంత సమర్థనీయమైనదో ఉపన్యాసం ప్రారంభించాడు జ్యోతిషుడు.

'కీరో' అనే పాశ్చాత్య సాముద్రికవేత్త ఎంత అద్భుతాలు చేశాడో సవివరంగా చెప్పాడు. ఎప్పుడేనా ఎవరి జ్యోతిషమైనా తప్పితే అది విద్యాలోపం గాని, శాస్త్రలోపం కాదన్నాడు. సమర్థుడైనవాడి నిర్ణయం అయితీరుతుం దన్నాడు. అందుకని 'కీరో' జీవితంలోంచి అనేక ఉదాహరణాలు చూపించాడు.

మహారథుడు నెపోలియన్ చక్రవర్తి ఎప్పుడూ తన ప్రక్కన ఒక జ్యోతిషుణ్ణి అట్టే పెట్టుకునే వాడట. ఆయన చెపితేనే యుద్ధానికి వెళ్ళే వాడట. ఆయన ఓడిపోయిన 'వాటర్లూ' యుద్ధం సమయంలో, నెపోలియన్ వెళ్ళబోయేముందు ఆ జ్యోతిషుడుదగ్గర లేడనీ, సమయం మించిపోతోం దని నెపోలియన్ వెళ్ళిపోయి ఓడిపోయాడనీ, చెప్పాడు. మిత్రులు తెల్లబోయి వింటున్నారు.

అంత మొండిగా వాదించే రాజా కూడా కిక్కురుమనలేదు.

ఆయన యింకా అన్నారుకదా- "భగవన్నిర్ణయాన్ని ఎవడు తప్పించగలడు? మన భవిష్యత్తు మనకి తెలిస్తేమాత్రం, కానున్నది మనం మార్చ గలమా? అంటారు కొందరు. కాని నిజం అది కాదు. ముందేప్రమాదం ఉందో తెలిస్తే మనం తప్పకుండా మార్చగలం. 'కీరో' ఎంతోమందికి అలా మంచిమార్గం చూపించాడు. ఒక మహా రాజకుమారుడికి ఒక సంబంధం వచ్చింది. పెళ్ళి కాకముందు "కీరో"ని సలహా అడిగారు. ఆయన యీ పెళ్ళి జరిగితే, యువరాజుకి మనశ్శాంతి ఉండదు, వీళ్ళిద్దరికీ పొసగదు, రాజ్యంమీద ఆ అమ్మాయి దుష్ప్రభావం ప్రబలుతుంది అని చెప్పే సరికి—ఆయన ఆ పెళ్లి మానేశాడు. ఆస్కార్ వైల్డ్‌ని ఎరుగుదురుగా! ఆ మహా రచయిత కీర్తి దిగంతమంతా వ్యాపించి ఉండగా, "కీరో" అతని చెయ్యిచూసి, యింకో ఏడేళ్ళల్లో నీ కీర్తికి పెద్ద దెబ్బతగులుతుంది. జాగ్రత్తగా ఉండు, అని చెప్పాడు. ఆయన హేళనగా "కీరో గొప్ప జ్యోతిషుడే కావచ్చు- కాని, నా విషయంలో ఆయనమాట నేను నమ్మను" అన్నాడు.

ఏమైంది? ఏడేళ్లుతిరగకముందే అంతటివాడూ జైల్లోపడ్డాడు. కీర్తిపోయింది డబ్బుపోయింది. అన్నీపోయాయి. ముందే జాగ్రత్త పడిఉంటే, అలా అయ్యేది కాదుగా!

ఇంతకీ యిది శాస్త్రం. నమ్మకం, అపనమ్మకాలతో పనిలేదు. మూడు నాలుగులు పన్నెండు. మీకు యిష్టమున్నా లేకపోయినా మూడు నాలుగులు పన్నెండే. ఈ శాస్త్రాన్ని తెలివిగా వినియోగించుకుంటే లాభిస్తుంది. లేకపోతే వాళ్ళకర్మ."

ఆయన ఉపన్యాసం అందరినీ ముగ్ధులనిచేసింది.

(ఇంకావుంది)

---

మనకంటె మన ముందుతరంవాళ్లు పుష్టిగా శరీరబలం కలిగి ఉండేవారనీ, నీతినియమాలు పాటించేవారనీ, అనుకుని అపోహపడుతూ ఉంటాం. ఈ రకంగానే, గతించిన కాలాన్ని తలుచుకుని లొట్టలువేస్తూ రానురాను మనుషులు చెడిపోతున్నారని వాపోయేవాళ్ల ప్రతితరంలోనూ ఉంటారు. చరిత్ర పుటలు తిరగవేస్తే ఇది ఋజువవుతుంది. కారణం మరేంలేదు—సాధారణమానవుడికి మార్పంటే ఏదో చెప్పలేని భయం.

—సోమర్‌సెట్ మామ్